

శ్రేష్ఠ పరీక్షల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గోపాలపురం

బిఆర్.అంబేద్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శ్రేష్ఠ పరీక్షల్లో 514 ఆలిండియా ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపల్ టి.ఉమాదేవి తెలిపారు. తమ విద్యార్థినులు ఇటీవల జాతీయ స్థాయిలో శ్రేష్ఠ (రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ టార్గెట్ ఏరియాస్) ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను కనపరిచినట్లు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు 44 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని డి.లిఖిత 514 ఆల్ ఇండియా ర్యాంకు సాధించగా మరొక నలుగురు విద్యార్థులు వెయ్యి లోపు ర్యాంకులు, మరొక 11 మంది విద్యార్థులు రెండు వేల లోపు ర్యాంక్ సాధించారని తెలిపారు. మరో 10 మంది విద్యార్థులు మూడు వేల లోపు ర్యాంక్, మిగిలిన విద్యార్థులందరూ నాలుగు వేల లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు.

కౌలు రైతులకు కష్టాలు తప్పవా?

కౌలు రైతులకు ఈ ఏడాదీ కష్టాలు తప్పేలా కనిపించట్లేదు. నేటికీ సగం మందికి కూడా కౌలుదారు కార్డులు అందలేదు. ఫలితంగా వారు ప్రభుత్వం అందించే ప్రయోజనాలకు దూరమవుతున్నారు. ఈ ఖరీఫ్‌కూ పెట్టుబడికి డబ్బులు లేక బ్యాంకుల నుంచి రుణాలు అందక నానా అగచాట్లు పడుతున్నారు. చేసేది లేక ప్రయివేటు వ్యాపారుల వద్దకు పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.


- సిసిఆర్ కార్డుల జారీలో తప్పని జాప్యం
- ఉమ్మడి జిల్లాలో సకాలంలో గుర్తింపు దక్కేనా.!
- ప్రయోజనాలను కోల్పోతామంటున్న కౌలుదారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదున్నర లక్షల మందికి పైగా వరి రైతులుండగా వీరిలో మూడున్నర లక్షల మందికి పైనే కౌలు రైతులున్నారు. సాధారణ రైతుల మాదిరిగా రుణాలు, రాయితీలు, వడ్డీ మాఫీ పథకాలు, పంటల నష్టపరిహారం వంటి ప్రభుత్వ ప్రయోజనాలు వీరికి సక్రమంగా అందడం లేదు. ప్రతి ఏటా అప్పులు చేసి సాగు చేస్తున్నా పెట్టుబడి సొమ్ములు కూడా రాని పరిస్థితులు నెలకున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు వచ్చి పంటలకు నష్టం జరిగితే అనేకమంది అప్పుల ఊబిలోకి కూరుకుపోయి చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. ఇలా కౌలు రైతులు కష్టాల సుడిగుండంలో చిక్కుకుంటున్నా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిసిఆర్ కార్డుల జారీలో జాప్యం చోటు చేసుకుంటుంది. అంతే కాకుండా పూర్తిస్థాయిలో రైతులందరికీ కార్డులు అందడం లేదు.

జాప్యంతో ఇబ్బందులు

జిల్లాలో 70 శాతం పంటలను కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ఖరీఫ్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. సొంతభూమి ఉన్న రైతులు ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలకు తోడు ఇప్పటికే వారి ఖాతాలో జమ అయిన రైతు భరోసా సొమ్ముతో సాగుకు సిద్ధమవుతున్నారు. కానీ జిల్లాలో ఉన్న కౌలు రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. వారిని గుర్తించడంలో తీవ్ర ఆలస్యం చోటుచేసుకుంటుంది. ప్రభుత్వం ఏటా వారికి అందించే సిసిఆర్‌సి(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు)పత్రాలు ఇప్పటికీ వారికి అందలేదు. యంత్రాంగం వాటి జారీ పనిలో ఉంది. గతంలో ఈ కౌలు పత్రాలు కలిగి ఉన్న రైతులు కూడా మళ్లీ రెన్యువల్ చేయించుకుంటేనే కార్డు మనుగడలోకి వస్తుంది. సిసిఆర్‌సి కార్డు గడువు 11 నెలల్లో ముగుస్తుంది. మళ్లీ భూ యజమాని అనుమతితో కార్డును రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని మే నెలాఖరుకు ముగించి ఖరీఫ్ ప్రారంభమయ్యే జూన్ మొదటి వారంలోపే కార్డులను రైతులకు అందించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ నత్తనడకన నడుస్తుంది. ఆగస్టు, సెప్టెంబర్ వరకూ కార్డులు అందే పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయశాఖ మార్గదర్శకాల ప్రకారం సంబంధిత పత్రాలన్నీ రైతులు సమర్పిస్తే విఆర్‌ఒల ఆమోదంతో ఈ కార్డులను కౌలు రైతులకు అందజేస్తారు. ఈ ప్రక్రియ అంతా జరిగి రైతులకు కార్డులు అందేసరికి ఆగస్టు వంగిని పోయే అవకాశం ఉందని కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగుకు అవసరమైన రాయితీ విత్తనాలతో పాటు అర్హత కలిగిన వారి రైతుభరోసా సాయానికి కూడా తీవ్ర జాప్యం జరుగుతుందని చెబుతున్నారు. సిసిఆర్‌సి కార్డులు సకాలంలో అందక కౌలు రైతులు గగ్గోలు పెడుతున్నారు.



నత్తనడకన జారీ ప్రక్రియ

మూడు జిల్లాల్లో మూడున్నర లక్షల మంది కౌలు రైతులు ఉంటారని అంచనా. అయితే ప్రభుత్వం అతి తక్కువగానే లక్ష్యాన్ని నిర్దేశించి అందజేస్తుంది. కాకినాడ జిల్లాలో 57 వేల కార్డులను అందించాలని లక్ష్యంగా తీసుకున్నారు. వీరిలో సుమారు 46 వేల మందికి రూ.190 కోట్లు పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు కేవలం 450 మందికి మాత్రమే కార్డులు అందజేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 77 వేలు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నప్పటికీ ఇప్పటి వరకు ఒక్క కార్డు కూడా జారీ చేయలేదు. అలాగే తూర్పు గోదావరి జిల్లాలో 1.09 లక్షలు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకోగా ఇప్పటి వరకు కేవలం 1300 మాత్రమే కార్డులు ఇచ్చారు. దీనిపై రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో భూ యజమానులకు సిసిఆర్ కార్డులపై అవగాహన కల్పించాలి. కార్డుని కౌలుదారుకి ఇచ్చినంత మాత్రాన భూమిపై యజమాని హక్కులకు వచ్చిన ముప్పేమి లేదని వివరించాలి. అదేవిధంగా కౌలు రైతులకు సైతం కార్డు వల్ల ఉపయోగాలను చెప్పి చైతన్యపరచాల్సిన అవసరం ఉంది. కానీ ఇవేమీ అమలు జరగడం లేదు.

ప్రయోజనాలు కోల్పోతున్న కౌలు రైతులు

క్షేత్రస్థాయిలో భూ యజమాని ఒప్పంద పత్రం తప్పనిసరి అంటున్న కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వం కౌలు రైతులకు కచ్చితంగా న్యాయం చెయ్యాలనుకుంటే భూ యజమాని ఒప్పంద పత్రం తీసుకునే బాధ్యతను రాష్ట్రప్రభుత్వమే తీసుకోవాలి. ఈ విధంగా కార్డులు ఇవ్వడం వలన పంట మీద వచ్చే రాయితీలను కౌలు రైతులకు చేరతాయి. కానీ అన్ని రాయితీల్లోనూ కేవలం 10 శాతం కూడా కౌలు రైతులకు దక్కడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి శాస్త్రీయమైన ఆధారాలతో వాస్తవ సాగు దారులకు కేటాయించిన రాయితీలు పూర్తిగా చేరితేనే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుంది.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నిడదవోలు



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాంబాబు, కార్మికులు

నిడదవోలు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రామ్ భూపాల్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు గత 5 సంవత్సరాల నుంచి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. రాంబాబు మాట్లాడుతూ టౌన్ జనాభా, విస్తీర్ణం పెరిగినా దానికి అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచలేదన్నారు. దీనివల్ల కార్మికులపై పనిభారం విపరీతంగా పెరిగిపోయిదన్నారు. కార్మికులకు సరైన పనిముట్లు ఇవ్వడం లేదని, ట్రాక్టర్లకు ఇంజన్ తప్ప రూపం లేదని, అవే ట్రాక్టర్లపై కార్మికులు నానా ఇబ్బందులూ పడుతూ చెత్తను మోస్తున్నారని తెలిపారు. ఆఫీసులో కొన్ని పరికరాలు వథాగా పడి ఉన్నాయని, సిబ్బంది సంఖ్య లేకపోవడం వల్ల అవి దుర్వినియోగం అవుతున్నాయని తెలిపారు. కార్మికులకు సంబంధించి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు అందించడంలో ఆఫీస్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. కార్మికులు మస్తరు సమయంలో కూర్చోవడానికి కనీస సౌకర్యాలు లేవని చెప్పారు. తక్షణమే సమస్యలు పరిష్కారం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూరుగోపు చిరంజీవి, బొచ్చ సాయి రమణ, బౌరిశెట్టి కొండ, బంగారు రాజేష్, కాకి రాజు జి.అప్పారావు, ముప్పిడి బ్రహ్మం పాల్గొన్నారు.



డిఇఒ వాసుదేవరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు తగ్గించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం డిఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ మాట్లాడుతూ 7వ తరగతి విద్యార్థులకు తొందరగా పాఠ్య పుస్తకాలను అందించాలని కోరారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని వారు డిఇఒను కోఆరు. నోట్ పుస్తకాలు అమ్మడం అరికట్టాలన్నారు. నోట్ పుస్తకాల పేరుతో వేల ఫీజులు దోపిడీ చేస్తున్నారని వీటిని అరికట్టాలన్నారు. నోట్ పుస్తకాలు అమ్మే స్కూల్స్ అనుమతులు రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాంబాబు, జిల్లా సహాయక కార్యదర్శి కె.జ్యోతి, నిశ్చల్ పాల్గొన్నారు.

సత్యవాడ ఫీడర్‌లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం-సత్యవాడ 11 కెవి ఫీడర్‌లో ఆర్‌డిఎస్‌ఎస్ పనుల నిమిత్తం బుధ, గురు, శుక్ర, శని వారాల్లో నాలుగు రోజులు ఉదయం 6.00 గంటల నుంచి మధ్నాహ్నం 12.00 గంటల వరకు 6 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎపిఇపిడిసిఎల్ నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వీరభద్రరావు తెలిపారు. ఈ కారణంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 5:00 గంటల నుంచి 6.00 గంటలు, మధ్యాహ్నం 12.00 గంటల నుంచి ఇచ్చేలా మార్చామని, రైతులు గమనించాలని తెలిపారు. గ్రామ ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

నేడు 12 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో నిర్మించిన వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద బుధవారం భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కుడప చక్రపాణి తెలిపారు. దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు 12 వేల మందికి అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఉండ్రాజవరం, నిడదవోలు, విజ్జేశ్వరం, పెరవలి మండలీఆలకు చెందిన యాత్రికులు ఈ అన్నదానంలో పాల్గొంటారన్నారు.

విగ్రహ ధ్వంసంలో ఎవరికీ సంబంధం లేదు

ప్రజాశక్తి-పెరవలి

మండలం ఖండవల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామి విగ్రహం కావాలని ఎవరూ ధ్వంసం చేయలేదని, మార్కెట్ కమిటీ స్వంతంగా విగ్రహం తరలించడం నేరం కావున కేసు కట్టామని కొవ్వూరు డిఎస్‌పి కె.శ్రీనివాస్ మూర్తి అన్నారు. తెలిపారు. ఈ విగ్రహం కేసులో కులాలకు మతాలకు పార్టీలకు ఎటువంటి సంబంధం లేదని, విగ్రహం పెట్టిన వాళ్ళు , తీసేసిన వాళ్లు హిందువులే అని తెలిపారు. మంగళవారం పెరవలి పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 10వ తేదీ తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఖండవల్లి జాతీయ రహదారి ప్రక్కన ఉన్న కనకదుర్గమ్మ గుడికి సంబంధించిన మార్కెట్ యార్డ్ స్థలంలో గుడి కమిటీ అనుమతి తీసుకోకుండా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఖండవల్లి గ్రామానికి చెందిన ఆనందం వీర గణపతి, కూనపురెడ్డి పెద్దకాపు, కౌలూరి ఉమామహేశ్వరరావు వెంకటేశ్వర స్వామి విగ్రహం ఏర్పాటు చేశారన్నారు దీనిపై విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు మే 10న వారిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. విగ్రహం పెట్టిన విషయమై కనకదుర్గమ్మ గుడి కమిటీ సభ్యులు విగ్రహ ప్రతిష్టాపనపై అభ్యంతరం వ్యక్తం చేసి మార్కెట్ యార్డు వద్ద రైతులకు వ్యాపారం చేసుకోవడానికి ఇబ్బందికరంగా ఉంటుందని విగ్రహానికి వేరే చోట స్థలం కొని అక్కడ గుడి కట్టించి విగ్రహం అక్కడ పెడదామని గుడి కమిటీ సభ్యులు, విగ్రహం పెట్టినవారు సమావేశం నిర్వహించగా పరిష్కారం కాలేదన్నారు. ఈ నెల 23న రాత్రి 11 గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహాన్ని తీసి ఖండవల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్దకు తెచ్చి పెట్టినట్టు తెలిపారు. ఈ క్రమంలో విగ్రహం కొంత భాగం విరిగిందని తెలిపారు. రెండు కేసులను కూలంకషంగా దర్యాప్తు చేసి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా దుష్ప్రచారం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముక్కామల బైపాస్ నక్కల కాలువ వంతెన పరిసర ప్రాంతాల్లో గంజాయి మద్యం సేవించి చిరు వ్యాపారులపై దాడి సెల్ ఫోన్ లాక్కుని దాడులు చేస్తున్నారని గ్రామస్తులు డిఎస్‌పి దృష్టికి తీసుకుని రాగా ఆయన స్పందించి ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహించి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు సిఐ వి.జానకిరామయ్య ఎస్ఐలు ఎజిఎస్ మూర్తి, వి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కె.శ్రీనివాసమూర్తి



అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మార్చిన జగనన్న విదేశీ విద్య పథకం పేరును తిరిగి డాక్టర్ అంబేద్కర్ విదేశీ విద్య అని పేరు పెట్టడం హర్షణీయమని నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీ ఎస్‌సి సెల్ నాయకులు హర్షం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని వేలివెన్ను మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు ఇంటి వద్ద ఆయనను దళిత నాయకులు, అభిమానులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. 2024 ఎన్నికలలో ఎన్‌డిఎ కూటమి పార్టీలు ఇచ్చిన హామీని నెరవేర్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్, సిఎం చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే సహించేది లేదు

ప్రజాశక్తి-తాళ్లపూడి

గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఏ పార్టీ నాయకులైనా సరే ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఎంఎల్‌ఎగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తాళ్లపూడి ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడారు. అధికారులు ప్రజాప్రతినిధులు అభివృద్ధి సంక్షేమం విషయంలో ప్రజలను పట్టించుకోకపోతే అథఃపాతాళానికి తొక్క వేస్తారన్న విషయం సార్వత్రిక ఎన్నికల్లో చూశామన్నారు. ప్రజలకు అనుగుణంగా అభివృద్ధితో పాటు పరిపాలన కొనసాగించాలన్నారు. జిల్లా పరిషత్ నుంచి మండలానికి రావాల్సిన సీనరేజ్ కూడా గత రాష్ట్ర ప్రభుత్వం జమ చేసుకోవడమేమిటని ప్రశ్నించారు. మండల పరిషత్తు ఆర్థిక పరిస్థితి గ్రామపంచాయతీలు కంటే అధ్వానంగా ఉందన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు అనేక సమస్యలను గుర్తించానని చెప్పారు. పలు గ్రామాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, వాటి అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపిడిఒ రమణ, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు తదితర నాయకుల సమక్షంలో ఎంఎల్‌ఎ కేక్ కట్ చేశారు. కార్యాలయానికి వచ్చిన ముప్పిడికి మండల స్థాయి అధికారులు వివిధ శాఖల అధికారులు కూటమి పార్టీలకు చెందిన నాయకులు ఘన స్వాగతం పలికారు.



ఎంపిడిఒ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ముప్పిడి

వ్యాధుల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి-గోపాలపురం


ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ మడిచర్ల ప్రసాద్ అన్నారు. మంగళవారం గుడ్డిగూడెం గ్రామంలో వర్షాకాలం నేపథ్యంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, దోమలను నియంత్రించేందుకు ముందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసాద్ మాట్లాడుతూ కలుషిత ఆహారం తీసుకోరాదని, కలుషితనీరు తాగరాదని వాటి పట్ల శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఇళ్ల పరిసర ప్రాంతాలలో చెత్తా చెదారాలు వేయకుండా, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. దోమలను నియంత్రించేందుకు దోమ తెరలు వాడాలని అన్నారు. తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించి చేతులు శుభ్రపరచుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండి ఏవైనా అనారోగ్య సమస్యలు వస్తే తప్పనిసరిగా వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ప్రజల రుణం తీర్చుకుంటా : ఎంఎల్‌ఎ మద్దిపాటి

ప్రజాశక్తి-నల్లజర్ల

తనకు అఖండ విజయం చేకూర్చిన మండల ప్రజలు రుణం తీర్చుకుంటానని గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మంగళవారం పోతవరం నుంచి ప్రారంభించిన విజయోత్సవ ర్యాలీ సుభద్ర పాలెం, కిష్టాయిగూడెం, కౌలూరు, చీపురుగూడెం, నల్లజర్ల మీదుగా ప్రకాశ్‌రావు పాలెం చేరుకుంది. మధ్య మధ్యలో ప్రజలతో మాట్లాడుతూ ఆయా అవసరాల నిమిత్తం సామాన్య ప్రజలు సైతం నేరుగా తనను కలిసి వివరించి పరిష్కారం పొందవచ్చని అన్నారు. ప్రజలు ఇచ్చిన విజయం తాను మరువలేనన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డికర్ల సువర్ణ రాజు, టిడిపి మండల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, పసుమర్తి సతీష్, యద్దనపూడి బ్రహ్మరాజు, జమ్ముల వీర వెంకట సతీష్. ఎలమాటి శ్రీనివాసరావు, ఏలేటి సత్యనారాయణ, కండిపు వెంకటరత్నం, బేతిన సత్యనారాయణ, శెట్టిపల్లి శివ నాగరాజు పాల్గొన్నా

కార్టూ'నిజం'



పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

నియోజవర్గంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తామని కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు ఎంపిడిఒ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా పరిపాలనలో పార్టీలకతీతంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి మెలసి పని చేస్తూ అభివృద్ధికి పాటు పడాలన్నారు. ఎంపిపి కాకర్ల నారాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ వెంకటేశ్వరరావు ప్రజా ప్రతినిధులను, అధికారులను పరిచయం చేసుకున్నారు. ప్రజల సమస్యలపై వారి దిశా నిర్దేశం చేశారు. విద్యుత్ శాఖాధికారుల ఆధ్వర్యాన ఎంఎల్‌ఎ వెంకటేశ్వరరావు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బొంత వెంకటలక్ష్మి, ఎంపిపి కాకర్ల సత్యనారాయణ, టూ మాన్ కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయుడు చౌదరి, సూరపనేని చిన్ని, టివి.రామారావు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

రేషన్ షాప్‌పై సివిల్ సప్లయిస్ అధికారుల దాడి

గోపాలపురం : మండలంలోని కరగపాడు పంచాయతీ పరిధిలోని బుచ్చిపాలెం రేషన్ షాపుపై సివిల్ సప్లై అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. గోపాలపురం సివిల్ సప్లై డిటి దివాకర్, దేవరపల్లి డిటి సత్యనారాయణ తెలిపిన వివరాలివి. బుచ్చిపాలెం షాప్ నెంబర్ 33లో రేషన్ లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు రేషన్ షాప్‌పై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఉండవలసిన స్టాక్ కన్నా 1750 కేజీలు బియ్యం స్టాకు తగ్గినట్లు గుర్తించినట్లు తెలిపారు. దుకాణదారునిపై 6ఎ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వేరే షాపు వారికి పంపిణీ బాధ్యతలు అప్పజెప్పినట్టు వారు తెలిపారు. వారి వెంట విఆర్ఒ గోతియ్య పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పరిసరాల పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి-కడియం

వర్షాకాలంలో డయేరియా, తదితర వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ ఆధ్వర్యంలో మంగళవారం కడియం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడుతూ నీటి వనరుల వద్ద ఎలాంటి నిల్వలు ఉండకూడదని, వాటర్ ట్యాంకులలో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, వాటర్ క్వాలిటీ టెస్టింగులు చేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా నీరు నిల్వ ఉండేచోట్ల దోమల మందులను పిచికారీ చేయాలని సూచించారు. గృహావాసాల్లో చెత్తా చెదారాలు ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపిడిఓ రాజ్ మనోజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎన్.జెస్సీ సుప్రియ, డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న, ఇఒపిఆర్‌డి విక్టర్ బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శివకుమార్, శివకుమార్, ఆరోగ్య విస్తరణాధికారి ఎంవిబి.రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి-నల్లజర్ల

పోతవరం గ్రామంలోని కొత్తపేటలో గంట దిలీప్ నేతత్వంలో మంగళవారం ప్రజల వినతులను స్వీకరించారు. సంబంధిత వినతి పత్రాలను టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు, నాయకులకు అందజేసి తక్షణమే పరిష్కారం అయ్యే దిశగా పనిచేస్తామని దిలీప్ తెలిపారు. సతీష్ శర్మ, కొమ్మర వెంకటరమణ. దొండపాటి మహేష్. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-పెరవలి

మండలం ఉసులుమర్రు పంచాయతీ ఉసులుమర్రుపాడు పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మున్సిపాలిటీ లాకుపేటకు చెందిన అంబేద్కర్ సేవా సమితి సహకారంతో విద్యార్థులకు ఉచిత రాత పుస్తకాలను సంఘ సభ్యుడు పెదపోలు వెంకటరాయుడు, గ్రామ సర్పంచ్ వీరమల్లు నాగలక్ష్మి సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు బొంతు సత్యనారాయణ, నేతల రాఘవరావు, భవాని ప్రసాద్‌ను విద్యార్థులకు చేస్తున్న సేవా కార్యక్రమాలపై అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాన్ బ్రహ్మన్న, పి.రవికుమార్, జి.శ్రీను, ఉపాధ్యాయులు కె.రాజేష్, ఎన్.రత్నమణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హోటల్స్‌పై ఎంఎస్‌ఒ తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో పలు హోటల్స్‌ను సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఎంఎస్‌ఒ కీర్తి ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టగా నిబంధనలకు విరుద్ధంగా వంట గ్యాస్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అలాగే గ్యాస్ రీఫిల్లింగ్ చేసే షాప్‌లలో తనిఖీలు నిర్వహించి 5 డోమెస్టిక్ సిలిండర్‌లను సీజ్ చేసి సదరు నిర్వాహకులపై కేసులను నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్‌లను పవన్‌కుమార్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు ఎంఎస్‌ఒ తెలిపారు. ఈ తనిఖీలలో పెద్దాపురం ఎంఎస్‌ఒ విజయకుమారి, విఆర్‌ఒ తులసిరాంజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోకవరం

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన కామరాజుపేటలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని కామరాజుపేట గ్రామానికి చెందిన చంద్రు రమణ (29) వ్యక్తిగత పనులపై గోకవరం వచ్చి పనులు ముగించుకొని తిరిగి వెళుతుండగా గోకవరం శివారులో తన బైకు అదుపు తప్పి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయలపాలయ్యాడు. తీవ్రరక్తస్రావం కావడంతో మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వరుస దొంగతనాలతో ప్రజల ఆందోళన

ప్రజాశక్తి- రాజానగరం

రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతానాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ నెల 18న రాత్రి రాజానగరం కొత్త కాలనీలో మూడు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరాలకు పాల్పడ్డారు. బంగారం, నగదు భారీగా అపహరించారు. పాతవెలుగుబొంద జగన్న కాలనీలో సోమవారం రాత్రి మరో చోరీ జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న బర్ల భవానీ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి ఇంటిలో సుమారు నాలుగు కాసుల బంగారం, ఒక కేజీ వెండి, రూ.25 వేల నగదు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్‌తో పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి - పెదపూడి

మండలానికి చెందిన గొల్లల మామిడాడ గ్రామంలోని గమ్యం జూనియర్ కాలేజీలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సిఐ ఆర్‌జె. సతీష్‌బాబు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్ధాలు గురించి, మాదకద్రవ్యాలతో పట్టుబడితే చట్టరీత్యా తీసుకొనే కఠిన చర్యలు, తదితర అంశాలపై వివరించారు. మాదకద్రవ్యాల గురించి ఎటువంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గమ్యం జూనియర్ కాలేజీ ఛైర్మన్ కర్రి శివారెడ్డి, ఎన్.దొరబాబు, పి.సత్యనారాయణ, సెబ్ ఎస్ఐ ఐఎన్ఎస్.బాలాజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎను కలిసిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని విట్ కర్ గర్ల్స్ హైస్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎయిడెడ్ పాఠశాలల్లో నెలకున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై చినరాజప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, హైస్కూల్ కరస్పాండెంట్ మైలాబత్తుల జానీమోజెస్, హెచ్‌ఎం రత్నకుమారి పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను వారసులకు ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి గ్రామంలో ఉన్న సర్వేనెంబర్ 256/1, 276/30 వరకూ గల 96 ఎకరాల అసైన్డ్ భూములను లబ్ధిదారుల వారసులకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్, కె.సింహాచలం, డి.అదృష్టదీపుడు ఒక ప్రకటనలో కోరారు. 1970లో కోరంగి గ్రామంలో ప్రభుత్వం ఒక్కొక్కరికి 2.40 ఎకరాలు చొప్పున 40 మంది లబ్ధిదారులకు అసైన్డ్ భూమి ఇచ్చిందన్నారు. ఆ భూమిని సెల్వరాజ్ అనే వ్యక్తి అన్యాక్రాంతం చేసి రొయ్యల చెరువులుగా మార్చి అనుభవించగా వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో 2007లో లబ్ధిదారులతో కలిసి భూముల్లో జెండాలు పాతి పలుమార్లు ప్రభుత్వ అధికారులకు, తాజా, మాజీ శాసనసభ్యులకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. అప్పటి రెవెన్యూ అధికారులు కోర్టులో పెండింగ్ లో ఉన్నదని అది తేలిన వెంటనే భూములు అప్పగిస్తామని చెప్పి ఏళ్లు గడిచిన ఇప్పటివరకు లబ్ధిదారులకు భూములు అప్పగించ లేదంటే ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పేదల పట్ల, చట్టాల అమలుపట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు లబ్ధిదారుల వారసులకు ఆ భూమిని వెంటనే అప్పగించాలని డిమాండ్ చేశారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం



సదస్సులో మాట్లాడుతున్న సిఐ సుబ్రహ్మణ్యం

మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా మండలానికి చెందిన చంద్రమాంపల్లి గ్రామంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం జరిగిన ర్యాలీ అనంతరం జడ్‌పి హైస్కూల్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎయుబి సిఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ ఎవివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల వైపు ఆకర్షితులైతే వారి భవిష్యత్తు నిర్వీర్యం అవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వైపు యువత ఆకర్షితులు కాకుండా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా వారు మాదకద్రవ్యాల వల్ల అనర్థాలు, అనారోగ్య సమస్యలపై వివరించారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా స్పష్టమైన అభిప్రాయంతో ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

అభివృద్ధి పనులను పరిశీలించిన మల్లాడి

ప్రజాశక్తి - యానాం



నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆయా శాఖల అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. స్థానిక గోపాల్ నగర్‌లోని ఆయుష్ ఆసుపత్రి నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు వ్యవసాయ శాఖ నుంచి భూములు బదలాయింపు తదితర అంశాలపై సమీక్షించారు. ఆయుష్ ఆసుపత్రి నిర్మాణం వద్ద భూములను ప్రజాపనులశాఖ రెవెన్యూ సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యానాం పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ప్రజా పనుల శాఖ, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శ్రీ విద్యాలయ పాఠశాలకు నోటీసులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలానికి చెందిన సుంకరపాలెంలో ఉన్న శ్రీ విద్యాలయా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు నోటీసులు జారీ చేసినట్లు ఎంఇఒ ఎ.మంగాయమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో కాకినాడ డివైఇఒ కె.వెంకటేశ్వరరావు పాఠశాలను తనిఖీలు చేశారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పాఠశాల యాజమని చోడిశెట్టి శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేసినట్లు ఎంఇఒ మంగాయమ్మ తెలిపారు.

పిల్లారాయ స్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - యానాం

యానాంలోని పిల్లారాయ స్వామికి ఆలయ అర్చకులు మానేపల్లి వీరభద్ర శర్మ పర్యవేక్షణలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాంగారక చతుర్థి, సంకష్టచతుర్థిని పురస్కరించుకుని ఆలయంలో భక్తులచే లక్షగరికపూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 108 లీటర్ల ఆవుపాలు, విశేష ద్రవ్యములచే ప్రత్యేక పూజలు చేశారు.

గ్రంథాలయానికి ఫ్యానుల బహుకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న శాఖా గ్రంథాలయానికి మంగళవారం టిడిపి పట్టణ కార్యదర్శి, మహారాణి సత్రం మాజీ ఛైర్మన్ తూతిక రాజు, నాగు సోదరులు ఫ్యానులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సింగం బుల్లయ్య, కొమ్మన అప్పారావు, నాని, బి అరవింద్, రామారావు, నరేంద్ర కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం రూ. 23 కోట్లు మంజూరు


ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చిన్నరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాను మెరుగు పరచేందుకు రూ.23 కోట్లు నిధులు మంజూరైనట్లు నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని 25వ వార్డు వేలంపేటలో ఎంఎల్‌ఎగా హ్యాట్రిక్ సాధించిన సందర్భంగా వార్డు ప్రజలు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు రక్షిత మంచినీరు అందించే విషయంలో ఇబ్బందులు ఉన్నందున వాటిని పరిష్కరించేందుకు రూ.23 కోట్లతో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ లోతట్టు ప్రాంతంగా ఉన్నందున దానిని ఎత్తుచేసి వర్షపు జలాలు నిలువకుండా పనులు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టడం తోపాటు మధ్యలో నిలిచి పోయిన వెలమ కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చెయ్యనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు అడబాల కుమార స్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్, నాయకులు యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, కౌన్సిలర్ బలుసు వాసు, తెదితరులు పాల్గొన్నారు.


డిజిపితో ఎంఎల్ఎ పంతం నానాజీ

డిజిపిని కలిసిన ఎంఎల్‌ఎ పంతం

ప్రజాశక్తి - కరప

రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావును కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలివారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు కార్యాలయంలో ఆయనను కలిసి నానాజీ శుభాకాంక్షలు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యానికి చర్యలు

రాజమహేంద్రవరం : రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని, దాతల సహకారంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పిస్తామని ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. వివిధ విభాగాలను తనిఖీ చేసి లోటుపాట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందేలా చర్యలు చేపడతామన్నారు. ఒపి వద్ద సర్వర్ లోపం కారణంగా కొద్దిగా జాప్యం జరుగుతోందన్నారు. దానిని సరి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సర్వర్ పని చేయని పక్షంలో మాన్యువల్‌గా ఓపీ ఇస్తున్నారన్నారు. ఎపి పేపరు మిల్లు సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా టెస్టింగ్ ఎక్విప్‌మెంట్‌ను సమకూరుస్తామన్నారు.